# అభివృద్ధి మాటున అక్రమాలు




- ఏకపక్ష నిర్ణయాలతో జడ్పీ ఆదాయానికి గండి
- బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాల యాజమాన్యంతో లోపాయికారి ఒప్పందం
- లీజు పేరుతో రూ.కోట్ల జడ్పీ ఆస్తులకు ఎసరు..?
- రినవేషన్ పేరుతో రూ.కోట్లలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం
- టెండర్లు లేకుండానే ఐరన్, ఫర్నీచర్, విలువైన సామగ్రి పక్కదారి
- అక్రమాలపై సీపీఐ మండిపాటు

కడప(రూరల్), మార్చి 4: జిల్లా ప్రజాపరిషత్ శాఖలో అభివృద్ధి మాటున అక్రమాలకు తెరలేపారు. వైసీపీ పెద్దల సేవలో తరిస్తూ ఏకపక్ష నిర్ణయాలతో అడ్డు అదుపులేకుండా జడ్పీ అధికారులు కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నారు. ఎలాంటి టెండర్లు పిలవకుండానే లీజుల పేరుతో రూ.కోట్ల జడ్పీ ఆదాయానికి ఎసరు పెడుతున్నారు. జడ్పీ ఆవరణలోని అన్న క్యాంటీన్ బిల్డింగ్ మొదలుకొని వందల కోట్ల విలువైన జడ్పీ క్వార్టర్స్ స్థలాన్ని అధికార పార్టీ పెద్దలకు సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి మాటున లీజుపేరుతో కారుచౌకగా కట్టబెట్టేందుకు లోపాయికారి ఒప్పందాలకు పావులు కదుపుతున్నారు. ఈ మేరకు జడ్పీ ఉన్నతాధికారులతో ఒకటి రెండుసార్లు సంప్రదింపులు జరినట్లు సమాచారం. ఇప్పటికే జడ్పీ కార్యాలయ ఆధునికీకరణ పేరుతో ప్రభుత్వ ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. సదరు పనులన్నీ అనుచర గణానికే కట్టబెట్టినట్లు తెలుస్తోంది. దీంతో పనుల అంచనాల విలువను మరింతగా పెంచి కమీషన్ల రూపంలో అధికార పెద్దలు దండుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అభివృద్ధి పేరుతో జడ్పీలో పలు భవనాలను కూల్చివేశారు. జడ్పీ కార్యాలయంలో దాదాపు 10 భవనాలను, పక్కనే ఉన్న కార్వర్టర్స్‌లో దాదాపు 20 భవనాలను కూల్చివేశారు. ఇందుకు లక్షల నిధులను ఖర్చు చూపించడంతో పాటు వాటికి సంబంధించిన ఫర్నీచర్, స్లాబ్‌ఐరన్, ఇనుప కిటికీలు, కటాంజనాలు, ఇనుప డోర్‌లు, వందలాది ట్రాక్టర్ల మట్టి, ఇటుకలు, భూమిలో పలి కట్టుడురాళ్లు.. ఇలా ప్రతిదీ ప్రభుత్వ అనుమతి లేకుండానే అనుమాయులతో అమ్మకాలు సాగించారు. వాటికి జమాలెక్కలు లేకుండా లక్షల్లో స్వాహా చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

### కారుచవకగా బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాలకు..

జడ్పీ ప్రాంగణంలో రూ.కోట్ల ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్ భవనాలు సైతం అంచనా విలువలు పెంచినట్లు సమాచారం. సదరు భవనాలను అనుచరగణానికి కట్టబెట్టి ప్లాన్ అప్రూవల్ లేకుండానే బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపట్టారు. వాటి పనులు ఒక పక్క జరుగుతుండగానే మరో పక్క వేలం నిర్వహించకుండానే వైసీపీ పెద్దలకు, అనుచరులకు కారుచవకగా లీజుకు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో రెండో అంతస్తు మొత్తాన్ని బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాలకు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు వినికిడి. ఈ మేరకు కళాశాల యాజమాన్యం తమ విద్యాసంస్థల పేరుతో కాంప్లెక్స్ రెండో అంతస్తులో బోర్డు ఏర్పాటు చేయడంతో ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నగర నడిబొడ్డులో అనుమతులు లేకుండా జడ్పీ పాలకమండలి బహుళ అంతస్తులు నిర్మిస్తుంటే నగరపాలక సంస్థ ఏమి చేస్తోందని పలువురు మండిపడుతున్నారు. ఇలా అభివృద్ధి మాటున జడ్పీ ఉన్నతాధికారులు అధికార పార్టీ పెద్దల సేవలో తరిస్తూ జడ్పీకి వచ్చే ఆదాయాన్ని అడ్డగోలుగా పక్కదారి పట్టిస్తుండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రభుత్వ పాలకమండలి అమోదంతోనే..



జడ్పీ కార్యాలయంలో ప్రతి అభివృద్ధి పనిని ప్రభుత్వ, పాలకమండలి స్టాండింగ్ కమిటీ అమోదంతోనే చేపడుతున్నాం. ఇందులో ఏకపక్ష నిర్ణయాలు ఏమీ ఉండవు. జడ్పీ వాణిజ్య సముదాయంలోని మొదటి ఫ్లోర్‌లో గదులను టెండరు ప్రక్రియ ద్వారా కేటాయిస్తాం. రెండవ అంతస్తులో 16 గదులను మాత్రం స్టాండింగ్ కమిటీ ఆమోదంతో జడ్పీ చైర్మన్ అప్రూవల్‌తో బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాల యాజమాన్యంతో టైఅప్ అయ్యాం. ఒక్కొక్క రూమ్‌కు రూ.ఒక లక్ష చొప్పున రూ.16 లక్షలు వారితో ఖర్చుచేయించి ఒక అడుగు రూ.24తో కేటాయించాం. అడుగుకు ప్రభుత్వం ధర రూ.10 మాత్రమే ఉంది. మేము అడుగుకు రూ.14లు అదనంగా ప్రభుత్వానికి ఆదాయం పెంచాం.

\- సుధాకర్‌రెడ్డి, జడ్పీ సీఈవో



జడ్పీ ఆవరణలోని ఫోరం బిల్డింగ్ భవనాన్ని కూలగొడుతున్న దృశ్యం



భవనానికి సంబంధించిన ఐరన్‌ను ట్రాక్టర్‌తో తరలిస్తున్న వైనం

## ఏకపక్ష కేటాయింపు రద్దు చేయాలి

- జడ్పీ సీఈఓ చేపట్టిన పనులపై విచారణ జరిపించాలి
- సీపీఐ నేతల డిమాండ్

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 4: దీపముండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న చందంగా వైసీపీ నేతల కన్ను ప్రభుత్వ ఆస్తులపై పడిందని, సీఎం సొంత ఇలాఖాలో జడ్పీ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారిందని, ఏకపక్షంగా బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాలతో చేసుకున్న ఒప్పందాలను తక్షణం రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో భారీ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎలాంటి నిర్మాణాలైనా స్థానిక సంస్థల అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. నగరంలో నగరపాలక సంస్థ అనుమతి లేకుండా కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారన్నారు. అంతటితో ఆగకుండా గుట్టుచప్పుడు కాకుండా బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాల యాజమాన్యంతో లోపాయికారి ఒప్పందం చేసుకుని బహిరంగ వేలం నిర్వహించకుండానే వారికి కట్టబెట్టడం వెనుక కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. జడ్పీ పాలకవర్గం ఏకపక్షంగా కేటాయించడం జిల్లా పరిషత్ ఆదాయానికి గండి కొట్టడమేనన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం రినవేషన్ పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ కార్యాలయంలోని ఫర్నీచర్, విలువైన సామగ్రిని అమ్మడంలో కూడా అక్రమాలు జరిగాయన్నారు. జిల్లా పరిషత్ ఆవరణంలో అడ్డగోలు నిర్మాణాలు చేపట్టి, విలువైన ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్న జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి అక్రమాలపై, ఆస్తులపై విచారణ జరిపించాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు అటు రాష్ట్రంలో ఇటు జిల్లాలోని ప్రభుత్వ ఆస్తులకు రక్షణలేకుండా పోతోందన్నారు. సొంత జిల్లాలోని జడ్పీ ఆస్తులను ఆడ్డదారుల్లో కట్టబెడుతుంటే చోద్యం చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, చంద్రశేఖర్, మహిళా సమాఖ్య నేత బషీరున్నీసా, సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, మద్దిలేటి, సావంత్ సుధాకర్, మునెయ్య, వలరాజు, మల్లికార్జున, లింగన్న, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ కార్యాలయం ఆవరణలో జరుగుతున్న నిర్మాణాల వద్ద ఆందోళన చేపడుతున్న సీపీఐ నాయకులు

## నోటిఫికేషన్ వచ్చిన వెంటనే.. పార్టీ గుర్తులు, నేతల ఫొటోలు తొలగించాలి

- కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి4: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 24 గంటల్లో రాజకీయ పార్టీల గుర్తులు, నేతల ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల నుంచి తొలగించాలని, ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ విజయరామరాజు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఎన్నిల నిర్వహణ సన్నద్ధతపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిదులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్ హాజరయ్యారు.

కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సాధాణ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమన్నారు. అదే స్థాయిలో రాజకీయ పార్టీల నుంచి కూడా సహకారం అవసరం ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా అమలు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులకు సంబంధిం క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా పరిశీలన చేసి, ఇప్పటికే వంద శాతం డూప్లికేట్, డెత్ ఓటర్లను తొలగించామన్నారు. 1500 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. గండికోట రిజర్వాయర్ ఆర్ అండ్ ఆర్ పరిధిలో 10 ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో 1941 పోలింగ్ కేంద్రాలు ఉండేవని ఈ సంఖ్య 1963కు చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం

- వలంటీర్లతో చెప్పించిన వైసీపీ నేతలు

మైదుకూరు, మార్చి 4: సార్వత్రిక ఎన్నికలు సమీపించే కొద్దీ అధికార పార్టీ నాయకులు వలంటీర్లను పార్టీ ప్రచారాలకు సన్నద్ధం కావాలంటూ ఆదేశించడం ఎక్కువ అవుతోంది. మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం అంటూ గృహ సారధులతో కలసి ఇంటింటికి తిరగాలంటూ మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో వైసీపీ నాయకులు వలంటీర్లను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఎంపీపీ వీరనారాయణ రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు రత్నకుమార్, సర్పంచి లక్ష్మీదేవి తదితర నాయకులు గృహ సారధులతో కలసి సోమిరెడ్డిపల్లె సచివాలయం 1, 2, 3తో పాటు మల్లెపల్లె, తోట్లపల్లెలలో పర్యటించారు. ఈ సందర్భంగా మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం అంటూ కరపత్రాలను విడుదల చేస్తూ వలంటీర్లతో కలసి నినాదాలు చేయించారు. ఒక పక్క ఎన్నికల విధుల్లో, ప్రచారంలో వలంటీర్లను వినియోగించుకోవద్దంటూ ఎన్నికల సంఘం పేర్కొంటున్నా.. వైసీపీ నాయకులు మాత్రం ఇలా వలంటీర్లను ఎన్నికలకు సిద్ధం చేస్తుండటం విశేషం.



బి.మఠం మండలంలో మేము సిద్ధం మా బూత్ సిద్ధమంటూ వలంటీర్లతో చెప్పిస్తున్న వైసీపీ నాయకులు

## గండికోట ముంపువాసులకు న్యాయం చేయండి

- కలెక్టర్‌కు బాధితుల వినతి



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన గండికోట ముంపు బాధితులు

కడప(కలెక్టరేట్), మార్చి 4: గండికోట ముంపు వాసులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు పరిహారం ఇవ్వకుండా అధికారులు ఇష్టారాజ్యంగా ఇచ్చేందుకు సిద్ధమయ్యారని, దీనిపై విచారించి న్యాయం చేయాలని గండికోట ముంపు బాధితులు సోమవారం కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముంపు బాధితులు మాధవరెడ్డి, పెద్దిరాజు, రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ గండికోట ప్రాజెక్టు కింద మొదటి విడతలో 14 గ్రామాలు ముంపునకు గురయ్యాయన్నారు. 2019లో ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ తాము అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం ఇచ్చిన రూ.6,75,000ల ప్యాకేజీకి అదనంగా రూ.3,25,000 ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు 2023లో రూ.454 కోట్ల విడుదలకు జీవో జారీ చేశారని, అందులో రూ.160 కోట్లు విడుదల చేస్తున్నట్లు గత నెల 20 వతేదీన నోట్ విడుదల చేశారన్నారు. ఆ మొత్తం మొదటి విడత ముంపు గ్రామాలకు మాత్రమే అని పేర్కొన్నారన్నారు. అయితే ఎన్నికల సమయంలో రాజకీయపెద్దల వత్తిడికి తలొగ్గిన అధికారులు ఇష్టారాజ్యంగా కొండాపురంలోని సప్లిమెంటరీ జాబితాకు డబ్బులు బదలాయించడం అన్యాయమని అన్నారు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే వారు సమాధానాలు దాటవేస్తున్నారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కలెక్టర్‌కు వారు మొర పెట్టుకున్నారు.

## పోలీసుల పల్లెనిద్ర

- ప్రశాంత ఎన్నికలే లక్ష్యం : ఎస్పీ



సిద్ధార్థ్ కౌశల్, ఎస్పీ

కడప (క్రైం), మార్చి 4: స్వేచ్ఛాయుత, ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ 'పల్లెనిద్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని పోలీసు యంత్రాంగం మొత్తం భాగస్వామ్యులయ్యేలా కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా అసాంఘిక శక్తుల ఆట కట్టించడంతో పాటు ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఎన్నికలపై ఎస్ఐ నుంచి ఉన్నత స్థాయి పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రోజుకో పల్లెలో గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో విస్తృతంగా చర్చిస్తారు. అలాగే గ్రామాల్లోని సమస్యలను కూడా తెలుసుకుంటారు. గ్రామంలో అసాంఘిక శక్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. గ్రామాల వారీగా డేటాను సేకరించి నమోదు చేసుకుంటారు.

### పోలీసుస్టేషన్ల వారీగా పల్లెనిద్ర

పోలీసుస్టేషన్ల వారీగా అధికారులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద కదలికల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గ్రామస్తులకు వివరిస్తారు. జైలు నుంచి విడుదలై వచ్చిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు స్థానికేతరులపై కూడా ఓ కన్నేసి ఉంచుతారు. అనంతరం ఆ గ్రామంలోనే నిద్రిస్తారు.

### డేటా సేకరణ

వివిధ కేటగిరీలుగా గ్రామాల వారీగా సమాచారాన్ని పోలీసు అధికారులు సేకరిస్తారు. ఆ డేటాను నమోదు చేసుకుంటారు. సదరు డేటా స్థానిక పోలీసుస్టేషన్ నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయం వరకు అందుబాటులో ఉంటుంది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేపట్టవలసిన ముందస్తు చర్యలు, ఏదైనా సమస్య తలెత్తినా, ఘటన జరిగినా వెంటనే స్పందించి కార్యాచరణకు ఉపక్రమించేందుకు ఈ డేటా ఉపయోగపడుతుంది.

### శాంతి భద్రతల కోసమే..

అసాంఘిక శక్తులను కట్టడి చేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పల్లెనిద్ర కార్యక్రమాన్ని రూపొందించాం. ఇందులో మొత్తం పోలీసు యంత్రాంగం భాగస్వామ్యం అవుతుంది. ప్రతి గ్రామానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు దోహదపడుతుంది. ప్రతిరోజూ ఆయా గ్రామాలకు వెళ్లి గ్రామసభలు నిర్వహించడం, స్పందనలో సమస్యల పరిష్కారం, పీస్ కమిటీ సమావేశాలు, గ్రామ సర్వే, పోలింగ్ కేంద్రాల పరిశీలన ఉంటాయి. చెడునడత, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వారికి పోలీసు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బలహీన వర్గాలు నివసించే ప్రాంతాలను పోలీసు అధికారులు, సిబ్బంది సందర్శించి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటేసేందుకు తాము అండగా ఉన్నామని భరోసా కల్పిస్తాం. ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లోను కావద్దని సూచించనున్నాం.

\- సిద్ధార్థ్ కౌశల్, ఎస్పీ

## 7, 8న పులివెందులలో సీఎం పర్యటన



పులివెందుల, మార్చి 4: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 7, 8 తేదీలలో పులివెందులలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. 7వ తేదీ గురువారం మధ్యాహ్నం విమానం ద్వారా కడపకు చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా 3:30గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గాన 3.40కి ఇడుపులపాయలోని వైఎస్సార్ మెమోరియల్ పార్క్‌కు చేరుకుంటారు. నూతన వైఎస్సార్ మెమోరియల్ పార్క్‌ను ప్రారంభిస్తారు. 4:05గంటలకు ఇడుపులపాయలోని గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం 8:30 ఇడుపులపాయ నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి పులివెందులలోని బాకరాపురం హెలిప్యాడ్‌కు 8:40కి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 8.55కి పులివెందుల మెడికల్ కళాశాలకు చేరుకుంటారు. 8.55నుంచి 9.35 వరకు మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 9.45గంటలకు నల్లపురెడ్డిపల్లె సమీపంలోని ఇంటిగ్రేటెడ్ బనానా ప్యాక్ హౌస్‌కు చేరుకుంటారు. 10గంటల ప్రాంతంలో ప్యాక్‌హౌస్‌ను ప్రారంభిస్తారు. 10.10 నుంచి 10.25గంటల మధ్య మినీ సెక్రటేరియట్‌ను ప్రారంభిస్తారు. 10.35గంటలకు వైఎస్సార్ జంక్షన్‌ను, అక్కడికి సమీపంలోనే ఉన్న బోలేవార్డును 10.40గంటలకు, 11.00గంటలకు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను, 11.05గంటలకు గాంధీజంక్షన్‌ను, 11.40గంటలకు ఉలిమెల్ల లేక్‌ను, 12.05గంటలకు ఆదిత్యబిర్లా యూనిట్‌ను ప్రారంభిస్తారు. 12.15గంటలకు ఆదిత్య బిర్లాలోని హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్ ద్వారా 12.30 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుని విజయవాడ వెళతారు.

## కాంగ్రెస్‌కు పునర్వైభవం ప్రారంభమైంది

- వైసీపీ చిత్తుగా ఓడిపోతుంది : తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 4: కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం ప్రారంభమైందని, ముఖ్యమంత్రి జగన్ పని అయిపోయిందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోతుందన్నారు. తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన పరిస్థితే ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు పడుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలలో జగన్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందన్నారు. అప్పులు ఫుల్, అభివృద్ధి నిల్, సంక్షోభంలో సంక్షేమం ఇది జగన్ పాలన అన్నారు. ఒక్కసారి అధికారం ఇచ్చినందుకే రాష్ట్ర సచివాలయం తాకట్టు పెట్టాడని, మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం మొత్తాన్ని హోల్‌సేల్‌గా తాకట్టు పెడతాడని తులసిరెడ్డి నిప్పులు చెరిగారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రావాలని పిలుపునిచ్చారు.

## మైదుకూరు డీఎస్పీ ఆకస్మిక బదిలీ

- టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టలేదని వైసీపీ నేతల అసహనం
- ఎన్నికలు ఏకపక్షంగా జరిపించుకోవడానికేనా?



(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం సొంత జిల్లాలో తమకు ఫలితాలు అనుకూలంగా రావని సర్వేలు వచ్చిన చోట రాజకీయ బదిలీలను ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఎన్నికల కమిషన్ మూడేళ్ల గడువు ముగిసిన పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులను నిబంధనల మేరకు బదిలీ చేయడానికి ఆదేశాలిచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తయింది. కాని వైసీపీకి ఎదురుగాలి ఉందనుకున్న చోట ఏకపక్షంగా ఎన్నికలు జరిపించుకోవడం కోసం తమకు అనుకూలమైన అధికారులను తెచ్చుకోవడం కోసం ఆగమేఘాల మీద బదిలీలు చేస్తోంది. మైదుకూరు నియోజకవర్గంలో ఈసారి అధికార పార్టీకి ఎదురుగాలి వీస్తుండటంతో అక్కడ ఎన్నికలు ఏకపక్షంగా జరుపుకోవడానికి అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తే పోలీసు అధికారులు ఉండాలని భావించినట్లు సమాచారం. అందులో భాగంగా మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్ ఆకస్మికంగా బదిలీ అయ్యారని ప్రచారం సాగుతోంది. మైదుకూరు డీఎస్పీగా వంశీధర్‌గౌడ్ 2022 ఫిబ్రవరి 3న బాధ్యతలు చేపట్టారు. వివాదరహితుడుగా ఎక్కడా దూకుడు లేకుండా లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేస్తున్న ఆయనకు జిల్లాలో ఉన్నతాధికారుల వద్ద సైతం మంచి గుర్తింపు ఉంది. కానీ మైదుకూరు నియోజకవర్గ అధికార పార్టీ పెద్దలు ఆ డీఎస్పీ ఉంటే ఎన్నికలు మనకు అనుకూలంగా జరిపించుకోలేమని అతనిపై ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఆ పార్టీ పార్లమెంటు స్థాయి పెద్దల వద్ద సైతం చర్చ జరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో డీఎస్పీ వంశీధర్ గౌడ్‌ను ఆగమేఘాల మీద ఆదివారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వంశీధర్ గౌడ్‌ను విజయవాడ ట్రాఫిక్‌కు బదిలీ చేసి అక్కడ ఉన్న వెంకటేశ్వర్లును మైదుకూరుకు బదిలీ చేశారు. జిల్లాలో ఇంకా ఎక్కడెక్కడ అధికార పార్టీకి ఎదురు గాలీ వీస్తుందని సర్వే రిపోర్టులు వస్తున్నాయో అక్కడంతా ఈ వారం పది రోజుల్లో బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### తప్పుడు కేసులపై పుట్టా పోరాటం

చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించిన పోలీసులపై న్యాయస్థానంలో పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రైవేటు కేసులు వేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా టీడీపీ నేత ధనపాల జగన్‌ను అక్రమ అరెస్టును నిరసిస్తూ సుధాకరయాదవ్ ఆందోళన చేశారు. అలాగే టీడీపీ నుంచి పోటీ చేసిన ఓ మహిళా కౌన్సిలరును పోలీసులే దగ్గరుండి వైసీపీ శిబిరానికి అప్పగించారంటూ ఆరోపించారు. ఇందులో భాగంగానే తప్పుడు కేసులు పెట్టారంటూ మైదుకూరులో డీఎస్పీగా పనిచేసిన అప్పటి విజయకుమార్, సీఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ సుబ్బరావులపై కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. మీపై తప్పుడు కేసులు పెడితే వారిపై ప్రైవేటు కేసులు వేద్దాం.. మీరు భయపడొద్దంటూ సమావేశంలో కార్యకర్తలకు భరోసా ఇచ్చేవారంటారు. దీంతో మైదుకూరు పోలీసులు వైసీపీ బాసుల ఆదేశాల మేరకు తప్పుడు కేసులు పెట్టాలంటే భయపడే పరిస్థితి వచ్చిందంటారు. కాగా... పుట్టా సుధాకర్‌యాదవ్‌పై మైదుకూరులో ఓ ధర్నా, బి.మఠం మండలం చంచయ్యగారిపల్లెలో పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించినట్లు కేసులు నమోదయ్యాయంటారు. వాటిపై అరెస్టు చేయాలని వైసీపీ నియోజకవర్గ బాస్ వత్తిడి తెస్తే ప్రస్తుత డీఎస్పీ పట్టించుకోలేదని చెబుతారు. తప్పుడుకేసులు పెడితే కోర్టుకు వెళతారు, ఇవన్నీ ఎందుకంటూ ఆయన సర్దిచెప్పినట్లు సమాచారం. తాము చెప్పినా కేసులు నమోదు చేయలేదంటే.. టీడీపీకి ఫేవర్ అనే నిర్ణయానికి వైసీపీ నేతలు వచ్చారు. అందుకే పట్టుబట్టి ఆయనను బదిలీ చేయించారని ప్రచారం సాగుతోంది.

# గిఫ్టు కొట్టు.. ఓటు పట్టు

- ఓటర్లకు వైసీపీ తాయిలాలు
- రైల్వేకోడూరులో విచ్చలవిడిగా బహుమతుల పంపిణీ
- ఇంటింటికీ వలంటీర్ల చేత అందజేత



మైసూరివారిపల్లె సచివాలయానికి వాహనంలో తరలించిన గిఫ్టులు

రైల్వేకోడూరు, మార్చి 4: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఓటర్లను మంచి చేసుకునేందుకు వైసీపీ నాయకులు ముమ్మరంగా తాయిలాలు ఇస్తున్నారు. ఇది రెండు రోజులుగా నడుస్తోంది. వలంటీర్ల చేత వైసీపీ బ్యాగులో చీరలు పెట్టి ఇంటింటికీ ఇస్తున్నారు. రైల్వేకోడూరు చరిత్రలో ఎన్నికలకు ముందు ఇలాంటి తాయిలాలు ఇచ్చిన దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో మాత్రమే గుట్టుచప్పుడు కాకుండా తాయిలాలు ఇస్తుంటారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే తాయిలాలు ఇచ్చి ప్రజలను ఆకట్టుకునేందుకు వైసీపీ బరితెగించింది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉన్న సచివాలయాలకు బహుమతులు చేర్చుతున్నారు. అక్కడి నుంచి గ్రామాలకు వలంటీర్లు చేర్చుకుని ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. ప్రతిరోజూ రైల్వేకోడూరుకు ప్రత్యేక వాహనాల్లో తాయిలాలను మూటల్లో తెస్తున్నారు. వాటిని పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయాలకు చేరవేస్తున్నారు. నియోజకవర్గం మొత్తం మీద ఉన్న ఓటర్లకు ఒక దుస్తుల కంపెనీతో చేతులు కలిపి జీరో పర్సెంటేజీతో చీరలను కొనుగోలు చేసి వాటిని నియోజకవర్గాల వారీగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాటిని కూలీల చేత సచివాలయాలకు తరలించి లెక్క చెబుతున్నారు. బహుమతులను ప్రజలకు అందించడానికి లక్షలాది రూపాయలు వైసీపీ పెద్దలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ప్రత్యేకంగా బ్యాగులు, అందులో చీరలు, స్వీటు బ్యాక్సులు తదితర వాటిని పెట్టి పంపిణీ చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి తాయిలాలు ఇస్తున్నారని టీడీపీ, జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోసారి ఓటర్లను వశం చేసుకోవడానికి పన్నాగం పన్నుతున్నారని టీడీపీ నాయకులు అంటున్నారు. రైల్వేకోడూరుతో పాటు ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాలకు కూడా బహుమతులు చేరుతున్నాయి. నాయకులు, వలంటీర్ల చేత పంపిణీ చేయించడానికి సిద్ధం చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు తాయిలాలను ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఇలా బరి తెగిస్తున్నారు. ఓటర్లను ఎలాగైనా ప్రలోభ పెట్టి ఓట్లు దండుకోవడానికి ఇది ఒక మార్గమని వైసీపీ నాయకులు ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ ఓటర్లను ఎలా తమ వైపు తిప్పుకోవాలని ముమ్మరంగా తాయిలాలు ఇస్తున్నారు. రెండు రోజుల్లో డబ్బులు కూడా ముందుగా ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోం ది. వైసీపీ నేతలు సంపాదించిన డబ్బులు ఇలా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బహుమతుల బ్యాగులకు వైసీపీ రంగులతో పాటు వైసీపీ పెద్ద నాయకుల ఫొటోలు ముద్రించి ఉన్నారు. బ్యాగులు, చీరలు తదితర వాటిని మహిళలు ఆకర్షించే విధంగా తయారు చేయించారు. దీనిని ఎలా అడ్డుకోవాలని టీడీపీ, జనసేన నాయకులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజలే అడ్డుకునే పరిస్థితి కనిపిస్తోంది. రైల్వేకోడూరులో వైసీపీపై ఉన్న వ్యతిరేకతతో తాయిలాలు ఇస్తున్నారని టీడీపీ, జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలని ప్రతిపక్షాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాగా సోమవారం రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లె సచివాలయానికి వాహ నంలో గిఫ్టులను తరలించారు. వాటిని పంచాయతీలో వలంటీర్లు పంపిణీ చేయడం కొసమెరుపు.

### నోటిఫికేషన్ రాక ముందు ఏమీ చేయలేము

ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందు ఓటర్లకు తాయిలాలు ఇస్తే ఎటువంటి చర్యలు తీసుకోలేమని రైల్వేకోడూరు ఎన్నికల అధికారి లీలారాణి తెలిపారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత తాయిలాలు ఇస్తే దానిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

## అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు

- ధర్నాకు డ్రైవర్లు
- క్వారీలో నిలిచిపోయిన వాహనాలు



ఇసుక రీచ్ వద్ద నిలిచిపోయిన వాహనాలు, నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

సిద్దవటం, మార్చి 4: మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీ పెన్నానది ఇసుక రీచ్‌లో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని సోమవారం డ్రైవర్లు నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ధరలు తగ్గించామని చెబుతున్నా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వాహనాల డ్రైవర్లు నిరసనకు దిగారు. ఒక ట్రాక్టర్ ఇసుక ధర ప్రభుత్వ బిల్లులో నిర్ణయించిన రేటు 2370 రూపాయలు ఉండగా వాటిపై అదనంగా 500 రూపాయలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలకు కంతులు కట్టలేక అవస్థలు పడుతూ ఉంటే ఇసుక మాఫియా చెలరేగిపోతుందని బిల్లుపైన ఉన్న రేటు తీసుకోకుండా అదనంగా డబ్బులు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గట్టిగా అడిగితే రోడ్ల మెయింటెనెన్స్ అని, రోడ్డుపై నీళ్ల చల్లుతున్నామని ట్రాక్టర్‌కు రూ.500, టిప్పర్‌కు అదనంగా 1500 రూపాయలు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఇసుక రీచ్ వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమం వద్ద డ్రైవర్లకు నచ్చచెప్పి ఏదైనా సమస్య ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టకూడదని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి అక్కడ నుంచి పంపించి వేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రిత్విక్ సాయి(ఫైల్)

సీకేదిన్నె, మార్చి 4: కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రిత్విక్‌సాయి (21) మృతి చెందాడు. సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. కడప నుంచి ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో బెంగుళూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు గువ్వలచెరువు ఘాట్ మొదటి మలుపు చేరుకోగానే రాయచోటి వైపు నుంచి వస్తున్న లారీ అతివేగంగా వచ్చి బస్సు ను వెనుకవైపు రిత్విక్‌సాయి కూర్చున్న సీటు వద్ద ఢీకొంది. దీంతో రిత్విక్‌కు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తోపాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడు రిత్విక్‌సాయి కడప ప్రకాష్‌నగర్‌కు చెందిన నాగ వెంకట శ్రీనివాసరావు కుమారుడుగా గుర్తించారు. శ్రీనివాసరావు సమాచార పౌర సంబంధాలశాఖ కడప కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. సీఏ చదువుతున్న కుమారుడు మృతితో శ్రీనివాసరావు కుటుంబం శోక సముద్రంలో మునిగింది.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివశంకర్

జమ్మలమడుగు, మార్చి 4: జమ్మలమడుగు పోలీసు సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం మైలా శివశంకర్(52) అనే వ్యక్తి విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొండాపురం మండ లం పొట్టిపాడు గ్రామానికి చెందిన శివశంకర్‌కు నలుగురు సంతానం. బాధితుడికి తండ్రి చౌడప్ప, తల్లి పాపమ్మ ఉన్నారు. తల్లి పాపమ్మకు 1.50 ఎకరా పొలం ఉంది. తమ్ముడు పురుషోత్తం ఆ పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడని కొండాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ న్యాయం జరుగలేదని జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయానికి వచ్చి సంబంధిత అధికారితో మాట్లాడినట్లు తెలిపారు. అక్కడ ఏమి జరిగిందో కానీ బయటకు వచ్చి అప్పటికే సిద్ధంగా తెచ్చుకున్న విషద్రావణం తాగి పడిపోయాడు. అక్కడే ఉన్న కొందరు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్తిగొడవలకు సంబంధించి న్యాయం జరగకపోవడంతో శివశంకర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించి జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా... శివశంకర్ ఆస్తి తగాదా విషయం వచ్చాడని, విచారణ చేస్తామని తెలిపామన్నారు.

## మానసిక వికలాంగుడు మృతి

ముద్దనూరు మార్చి 4 : మండల కేంద్రంలోని కోడిగాండ్లపల్లె సమీపంలోని గండికోట ప్రాజెక్టుకు వెళ్లే దారిలోని వంకలో మానసిక వికలాంగుని శవం లభ్యమైనట్లు ఎస్ఐ మొయిద్దీన్ తెలిపారు. మతిస్థిమితం లేని ఇతను రెండు నెలల క్రితం కోడిగాండ్లపల్లె సమీపంలోని ఏసుకరుణాలయానికి వచ్చినట్లు తెలిపారు. బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు, దాదాపు 50 సంవత్సరాలు వయస్సు ఉంటుందన్నారు. 10 రోజుల క్రితం ఏసుకరుణాలయం ఆశ్రమం నుంచి బయటకు వెళ్లాడు. గొర్రెల కాపురుల తెలిపిన సమాచారం మేరకు ఆశ్రమం మేనేజర్ ఇమ్మానియేల్ డిసోజా అక్కడికి వెళ్లి గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కడప (క్రైం), మార్చి 4: కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలో సాయంత్రం వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో బంగారుగొలుసును చైన్ స్నాచర్లు లాక్కెళ్లారు. వెంటనే బాధిత మహిళ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు..హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ప్రభావతమ్మ గృహిణి. ప్రతిరోజూ సాయంత్రం వేళలో వాకింగ్ చేస్తుంటుంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం వాకింగ్ చేస్తున్న సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో వచ్చి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారుగొలుసు లాక్కెళ్లినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదునట్లు పోలీసులు తెలిపారు.

## మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడప (క్రైం), మార్చి 4 : కడప నగరం ద్వారకానగర్‌లో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. చెన్నూరు మండలం కొండపేటకు చెందిన షేక్ సయ్యద్ మౌలానా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో అరెస్టు చేసి , అతని వద్ద నుంచి 30 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఉరి వేసుకుని వ్యక్తి మృతి

ఖాజీపేట, మార్చి 4: ఖాజీపేట టీచర్స్ కాలనీ వెనుకభాగంలో రాజ్‌కుమార్ (28) ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబంలో వచ్చిన కలతల కారణంగా భార్యా భర్తలిరువురు ఉదయం ఘర్షణపడ్డారు. భార్యను పుట్టింటికి పంపి సాయంత్రం రాజ్‌కుమార్ ఇంటిలో ఉరివేసుకుని మృతి చెందాడు. ఇతనికి ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.

## ఆర్టీసీలో యూనియన్‌ల పట్ల విద్వేషాలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

కడప (మారుతీనగర్), మార్చి 4 : ఆర్టీసీ మనుగడలో కీలకపాత్ర వహిస్తున్న ఉద్యోగుల (కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్స్)ను యూనియన్ల పేరుతో సంబంధిత కడప రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు, సీఐలు, గ్యారేజీ సూపర్‌వైజర్లు వ్యవహరిస్తున్న తీరు సరికాదని ఆర్టీసీ కడప డిపో గౌరవాధ్యక్షుడు చిట్టిబోయిన సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక బస్టాండు సమీపంలోని కార్మికపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ అభివృద్ధికి అన్ని యూనియన్‌ల నాయకులు, సభ్యులు పగలనకా, రాత్రనకా శ్రమిస్తున్న సంగతి తెలిసిందే అన్నారు. అలాంటి వారి పట్ల యూనియన్‌ల పేరుతో విద్వేషాలు కలిగేలా పాల్పడటం తగదన్నారు. గత నెల 27న కడప డిపోలో కొందరు సూపర్‌వైజర్లు మిగతా యూనియన్ నాయకులతో కలిసి ఒక యూనియన్ వారిని అవమానకరంగా వాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకుని యూనియన్‌ల మధ్య చిచ్చుపెట్టి పైశాచిక ఆనందం పొందే పద్ధతులకు స్వస్తి పలకాలన్నారు. వచ్చే మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అత్యధిక ఆదాయాన్ని పొందేలా ఉద్యోగులతో సఖ్యతగా వ్యవహరించి లక్ష్యాన్ని అందుకోవాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు వాసుదేవరావు, ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కుంట ఆక్రమణను అడ్డుకున్న సావిశెట్టిపల్లె గ్రామస్తులు



కుంటను చదునుచేస్తున్న ట్రాక్టర్‌లను అడ్డుకున్న గ్రామస్తులు

కాశినాయన మార్చి4: మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామసమీపంలోని మంగళపేరమ్మ కుంటను అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు ఆక్రమణకు పాల్పడగా సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికుల వివరాల మేరకు.. పోరుమామిళ్ల పట్టణంలో ఉంటున్న వైసీపీకి చెందిన ఓమాజీ ఎంపీటీసీ సభ్యుడు, పట్టణ సమీపంలోని పంచాయతీకి సర్పంచ్‌గా ఉంటున్న వ్యక్తి ఇరువురు గత మూడు రోజులుగా మిషనరీలతో కుంటను చదును చేస్తున్నారు. వీరిద్దరూ కుంటకు సమీపంలోని కొంత పొలం కొనుగోలు చేశారు. ఆ పొలమే చదును చేసుకుంటున్నట్లు మొదట భావించామని.. తీరా చూస్తే ఏకంగా సగంకుంటను ఆక్రమించినట్లు గుర్తించి స్థానిక సర్పంచ్ సగిలి ప్రసాద్, మాజీ సర్పంచ్ రఘునాదరెడ్డితో పాటు గ్రాస్తులు మద్దిరెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి,సాయినాద్‌రెడ్డి తదితరులు కుంటను చదునుచేస్తున్న యంత్రాలను అడ్డుకొని వెనక్కి పంపామని తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈకుంట అభివృద్ధి కోసం ఇప్పటి వరకు దాదాపు రూ.40 లక్షలు ప్రభుత్వ సొమ్మును ఖర్చుచేశారన్నారు తూము అలుగు నిర్మాణంతో పాటు సువిశాలంగా కట్టను నిర్మించారు. ఈకుంటకు నీరు చేరితో భూగర్భజలాల పెరుగుదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాంటి కుంటను గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రి చదునుచేసి వ్యవసాయభూమిగా మార్చాలని చూడటం దారుణమన్నారు. ఈవిషయం స్థానిక వీఆర్వోకు తెలిసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి పేరమ్మకుంటను ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈవిషయంపై తహసీల్దారు కృష్ణను వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిందని.. మంగళవారం ఆర్ఐతో విచారణ చేయించి ఆక్రమణ జరిగినట్లు తేలితే బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలి



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 4: జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో సమస్యలతో వచ్చిన అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్య నారాయణ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపె నింగ్ లేకుండా సంతృప్తిస్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు.

## మూడో రోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

రాయచోటిటౌన్, మార్చి 4: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం మూడో రోజు జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిధిలోని 54 పరీక్షా కేంద్రాల్లో 16,443 మంది విద్యార్థులకు 15,529 మంది పరీక్షకు హాజరుకాగా 914 మంది గైర్హాజరయ్యారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ రాయచోటి పట్టణంలోని పద్మావతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ గురించి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్యతో పాటు పరీక్షల ఇన్విజిలేటర్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరీక్షల నిర్వహణ సిబ్బందికి తగు సూచనలు చేశారు.

## కౌన్సిలర్‌గా..ఉపాధ్యాయుడిగా...?

- నిబంధలకు విరుద్ధంగా కొనసాగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్సీ డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 4: పులివెందుల మున్సిపాలిటీలో 23వ వార్డు కౌన్సిలర్ కొంగనపల్లె కొండలరావు ఉపాధ్యాయుడా లేక కౌన్సిలరో అర్థం కావడం లేదని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పులివెందులలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో కొండలరావు టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి 1998లో ఉపాధ్యాయ ఉద్యోగం కోసం డీఎస్సీ రాయగా అప్పట్లో ఉద్యోగం రాలేదన్నారు. గత ఏడాది ప్రభుత్వం 1998 అర్హులకు ఉద్యోగాలను ఇచ్చే క్రమంలో కొండలరావు ఉపాధ్యాయ పోస్టుకు అర్హత సాధించి ఉద్యోగం పొందాడన్నారు. ప్రస్తుతం లింగాల మండలం లోపట్నూతల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1009462822 ఐడీ నెంబర్ కలిగి ఉండి ఉపాధ్యాయుడిగా నిచేస్తున్నాడన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజాప్రతినిధి ప్రభుత్వం ఉద్యోగం చేయరాదని, ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ.. ప్రజాప్రతినిధిగా కొనసాగడానికి రాజ్యాంగం ఒప్పుకోదని, కానీ అధికార అండదండలతో కొండలరావు ఒకే సమయంలో రెండు విధులను నిర్వర్తిస్తున్నాడన్నారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డికి తెలిసిన కొండలరావుకు అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చి విధులను నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, స్థానిక విద్యాశాఖ అధికారులు కొండలరావుకు మద్దతుగా నిలబడడం దురదృష్టకరమన్నారు. ఈ అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు డిక్లరేషన్ ఇచ్చి ప్రజాప్రతినిధిగా రాజీనామా చేయకుండా టీచర్‌గా కొనసాగుతున్న కొండలరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్లేల మాజీ సర్పంచు నాగిరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించండి : ఎస్పీ

రాయచోటిటౌన్, మార్చి 4: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందంచి బాధితులకు చట్ట ప్రకారం పరిష్కారం చూపాలని అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ క్రిష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈసందర్భంగా అదనపు ఎస్పీ జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన 56 మంది ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం చేకూర్చాలన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల టౌన్, మార్చి 4: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాలను సోమవారం కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌లు పరిశీలించారు. మెడికల్ కళాశాల, బనానా ప్రాసెసింగ్ యూనిట్, మినీ సెక్రటేరియట్, వైఎస్సార్ జంక్షన్, బోలేవార్డు, షాపింగ్ కాంప్లెక్స్, గాంధీ జంక్షన్, ఉలిమెల్ల లేక్, ఆదిత్య బిర్లా యూనిట్ ప్రాంతాలలో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనను విజవయంతం చేసేందుకు ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ వినోద్‌కుమార్, తహసీల్దార్ వెంకట రమేష్‌బాబు, సీఐలు శంకర్‌రెడ్డి, బాల మద్దిలేటిలతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మామిడి మొక్కలు, ఎర్రచందనం చెట్లు దగ్ధం

- రూ.8లక్షలు నష్టం
- ఆదుకోవాలని బాధితుడి విన్నపం



మొక్కలు కాలిపోయాయని చూపుతున్న తిరుమల్‌రెడ్డి

చక్రాయపేట, మార్చి 4: మండలంలోని కె.ఎర్రగుడి గ్రామం ముద్దప్పగారిపల్లెలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఎనిమిది ఎకరాలలో మామిడిమొక్కలు, ఎర్రచందనం చెట్లు దగ్ధమైపోయాయి. ఈ ప్రమాదంలో రూ.8లక్షలు నష్టం సంభవించినట్లు బాధితుడు తెలి పా రు. అతని వివరాల మేరకు.. ముద్దప్పగారిపల్లెకు చెందిన మంచూరి తిరుమల్‌రెడ్డి అనే రైతు రెండు సంవత్సరాల క్రితం 400 మామిడిమొక్కలు, 400 ఎర్రచందనం మొక్కలు నాటాడు. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో అది కంచెకు పాకి చుట్టూ కల్లంతా కాలిపోవడంతో పాటు తోటలోని గడ్డికి అంటుకుని మంటలు వ్యాపించి మామిడిమొక్కలు, ఎర్రచందనం చెట్లు పూర్తిగా దగ్ధమైపోయాయి. తిరుమల్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండడంతో విషయం తెలుసుకొని గ్రామానికి వచ్చి చూడగా.. తోట పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.8లక్షలు నష్టం ఉంటుందని చెబుతున్నారు. అధికారులు స్పందించి తోటను పరిశీలించి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి


ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 4 : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరం 38వ డివిజను చిలకలబావి నుండి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు అందించారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమ పథకాలు, అబివృద్ధికి సం బంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన పెరిగిపోతుందన్నారు. ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, మారణకాం డ జరుగుతున్నాయని ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారని అన్నారు. దీనిని అధిగమించాలంటే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సి ఉందని చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే వీటన్నింటికీ పరిష్కారం అవుతుందని అన్నారు. ఆదిల్, ఆరిఫ్, ఆసిఫ్, సుబ్బారెడ్డి, ఫైజల్, జాకీర్, మహబూబ్‌బాషా, ఫైరోజ్, జమీల్, జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే టీడీపీ ధ్యేయం: పుత్తా


పుత్తా నరసింహారెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

వల్లూరు, మార్చి 4: మహిళా సాధికారతే టీడీపీ ధ్యేయమని టీడీపీ ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఫైడికాల్వ గ్రామంలో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. పుత్తా గ్రామంలోకి రాగానే బాణసంచా పేలుస్తూ మహిళలు హారతులు పట్టి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ వస్తే వచ్చే అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే మూడు సిలిండర్లతో పాటు పెళ్లి చేసుకున్న ప్రతి ఒక్కరికీ కల్యాణమస్తు పథకం కింద నగదు కూడా అందిస్తుందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ల్లో ప్రయాణాలు కల్పిస్తామన్నారు. కార్పొరేషన్లు తిరిగి నెలకొల్పి ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు, బలహీన వర్గాలకు సబ్సిడీ ద్వారా ని ధులు కేటాయిస్తామన్నారు. టీడీపీలోకి స్వచ్ఛందంగా నాయకులతో పాటు ప్రజలు కూడా చేరుతున్నారని, ఇదెం తో శుభ పరిణామమన్నారు. కమలాపురం, జనసేన ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డితో పాటు యువనేతలు క్రిష్ణచైతన్యరెడ్డి, లక్ష్మీరెడ్డి, సాయినరసింహారెడ్డి, డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మామిడి రైతుల ఆశలు ఆవిరి

● అదును దాటినా కనిపించని పూత ● పెట్టుబడులు వృథా ● ఆందోళనలో రైతన్నలు



చక్రాయపేట మండలం సురభి గ్రామంలో పూత పూయని మామిడి చెట్లు... పూత వచ్చి రాలిపోయిన దృశ్యం

చక్రాయపేట, మార్చి4 : మండలంలో ప్రధాన పంట మామిడి.ఆ మామిడి పంటపై రైతులు ఎన్నో ఆశలుపెట్టుకున్నారు. కానీ సకాలంలో కోతలు రాక రైతులు నిరాశకు గురయ్యారు. అదునుపోయిన నేటికీ మామిడిచెట్లకుపూత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతునానరు. ఒక వేళ అక్కడక్కడ పూత వచ్చిన అది నిలవడం లేదు. ఈ ఏడాది భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. సకాలంలో వర్షాలు రాక అదునులో పదును పడక డిసెంబరులో రావాల్సిన పూతలు ఫిబ్రవరి అయిపోతున్న నేటికీ పూతలు రాలేదు. ప్రస్తుతం పూత వస్తున్న ఎండలకు తాళలేక వాలిపోతోంది. మామిడిపంటపై రైతులు ఎన్నో ఆశలుపెట్టుకొని లక్షలు ఖర్చుచేశారు. మామిడిపంట పోతే రైతుకు బతుకు భారం అవుతోంది. అప్పులు ఎక్కువ అవుతాయి. డిసెంబరులో పూత వచ్చి మామిడికాయలు వచ్చి ఉంటే రైతుకు మంచి గిట్టుబాటు ధర ఉండేది. ప్రస్తుతం పూత వచ్చిన ఏమాత్రం ఫలితం లేదు. మండలంలో దాదాపు నాలుగువేల ఎకరాలకు పైబడి మామిడి తోటలు సాగుచేశారు. అటు ప్రకృతి, ఇటు ప్రభుత్వం రైతుకు సహకరించడం లేదు. మామిడిపంటలో వివిధ రకాల రోగాలు ఆశించి పంటనునాశనం చేశాయి. రైతులు దుక్కులకు, ఎరువులకు, మందులకు భారీగా ఖర్చుపెట్టారు. పంటపై పుచూసి నిరాశ చెందుతున్నారు. మండలంలో సురభి, చిలేకాంపల్లె, గడ్డంవారిపల్లె, మహదేవపల్లె, గంగారపువాండ్లపల్లె, గొట్లమిట్ల, నెయ్యపల్లె, కుప్పం, ఎర్రగుడి తదితర ప్రాంతాలలో మామిడి విరివిగా సాగుచేశారు. ఎంతో ఆశగా ఎదురుచూశారు. భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావులు ఎత్తిపోయా యి. నీరు లేక మామిడిచెట్లు ఎండిపోతే పరిస్థితి వచ్చింది. ఈ ఏడాది పంట బాగ వస్తుందని, ట్రాక్టర్లతో నీరు పెడుతూ కాపాడుకుంటూ వస్తున్నారు. ఈ ఏడాది సక్రమంగా వర్షాలు అనుకుంటూ ప్రతి ఏడాది రైతులు ఎదురుచూస్తున్నారు. కానీ రైతులకు నిరాశే మిగిల్చింది. పంటలపై నిరాశచెంది పంటలు పెట్టకుండా రైతులు సెలవు తీసుకున్నారు. మా మిడితోటలపై ఎక్కువ మోజు పెంచుకున్నారు. అది కూడా రైతును పూర్తిగా దెబ్బతీశాయి. సురభి గ్రామంలో మామిడికాయల కోసం వ్యాపారులు నాలుగైదు షెడ్లు ఏర్పాటుచేశారు. ఇక్కడ ప్రతి ఏట రూ.150 నుంచి రూ. 200కోట్ల వరకు వ్యాపారం జరిగేది. ఈ ఏడాది ఆ షెడ్లు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.సబ్సిడీతో రైతులకు ఎరువులు అందించి ఉంటే రైతులు కొంచెం ఉపశమనం పొందేవారు. రైతు భరోసా పెట్టారు కానీ మార్కెట్‌లోకి రైతు భరోసాకి తేడా లేకపోవడంతో ఏం లాభం అని పేర్కొంటున్నారు.

### ఈ ఏడాది మామిడి పూర్తిగా ఎత్తిపోయింది

నాకు 20 ఎకరాల పొలం ఉంది. పంట సాగుచేసేందుకు దాదాపు రూ.6లక్షలు ఖర్చు అయింది. కానీ పంట చూస్తే రూ.2 లక్షలు కూడా వచ్చే అవకాశం లేదు. నా పరిస్థితి అనేకమంది రైతులకు ఉంది. దీంతో రైతులు అప్పుల పాలు అవుతారు. ప్రభుత్వమే కాపాడాలి. రైతులకు రుణమాఫీ లేక నష్టపరిహారం ఇస్తే కోలుకుంటారు. కనీసం ఎరువులు కూడా సబ్సిడీపై ఇవ్వలేదు.

- మధుసూదన్‌రెడ్డి, ఊటుకూరువాండ్లపల్లె, సురభి, చక్రాయపేట మండలం

### 20 ఎకరాల్లో మామిడి సాగుచేశా

గడ్డంవారిపల్లె గ్రామం తొట్టికాడపల్లెలో 20ఎకరాల్లో మామిడి సాగుచేశా. రూ.8లక్షలు ఖర్చు వచ్చింది పంట మాత్రం రాలేదని, ఇపుడు పూత వచ్చిన ఎండలకు నిలవడం లేదని, కనీసం రూ.3లక్షలువచ్చిన ఖర్చులు అయినా వస్తాయని ఎదురుచూస్తున్నాం.

- వసంత రామకృష్ణారెడ్డి, తొట్టికాడపల్లె, చక్రాయపేట మండలం

### మహిళాఉద్యోగుల ఆటల పోటీలు ప్రారంభం

కడప(కలెక్టరేట్), మార్చి 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జియోన్ కళాశాల మైదానంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు మానసిక వికాసం కోసం ఈ క్రీడాపోటీలను నిర్వహిస్తామన్నారు. షాట్ పుట్, జావెలిన్ త్రో, రన్నింగ్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహిస్తామన్నారు.





## నేడు టీడీపీ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ

కమలాపురం రూరల్, మార్చి 4:టీడీపీ ఆధ్వర్యంలో కమలాపురం పార్టీ ఆఫీసు నుంచి పెద్దచెప్పలి వరకు నేడు నిర్వహించే బైకు ర్యాలీలో టీడీపీ కార్యకర్తలు పాల్గొనాలని కమలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాజీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజల అబివృద్ధి ధ్యేయంగా చంద్రబాబు ఆదేశాల మేరకు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా కమలాపురం నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయం నుంచి బైకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. బైకు ర్యాలీలో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి పాల్గొంటారని అన్నారు.

## నిరాశ్రయుల వసతిగృహంలో అన్నదానం

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 4 : నూకనబోయిన గంగన్నయాదవ్ 14వ వర్ధంతి సందర్భంగా సోమవారం కడప ఓల్డ్ రిమ్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో వారి కుమారుడు నూకనబోయిన శివయాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గోపాల్‌స్వామి, మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, వెంకటసుబ్బయ్య, ఆదరణవసతిగృహం నిర్వహణ విజయబాబు, అనూష పాల్గొన్నారు.

## వేంపల్లెలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం

వేంపల్లె, మార్చి 4: శివరాత్రి పండుగను పురస్కరించుకొని వేంపల్లెలో త్రైతసిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక పులివెందుల కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం చేశారు. సోమవారం వేంపల్లెలోని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి చేతులమీదుగా పుస్తకాలను విడుదల చేశారు. అనంతరం పులివెందుల కమిటటీ అధ్యక్షుడు వరుణ్‌కుమార్, సభ్యులు నరహరి, హరి, శివ, గురుమూర్తి, మహేష్ తదితరులు వేంపల్లెలో ప్రచారం చేశారు.

## యూసీఐఎల్‌లో భద్రత జెండా ఆవిష్కరణ

వేముల, మార్చి 4: మండలంలోని ఎం.తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో భద్రత జండా ఆవిష్కరించారు. సోమవారం జాతీయ భద్రత ఉత్సవాలలో భాగంగా ప్రాజెక్టు జనరల్ మేనేజర్ ఎం.ఎస్.రావు మాట్లాడుతూ గనులలో పనిచేసే ప్రతి ఒక్కరికి భద్రత, బాధ్యతగా, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూసీఐఎల్, ఎస్ఎంఎస్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



## ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యం: డీఈఓ


మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 4:ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలని డీఈఓ అనురాధ పిలుపునిచ్చారు. సోమవారం అలంఖాన్‌పల్లె జడ్పీ హైస్కూలును సందర్శించారు. ముందుగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే అకడమిక్ రిజిస్టర్లు, ఉపాధ్యాయులు, స్టాఫ్ విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్లను, పీఎల్ రిజిస్టర్లను గుడ్లు, చిక్కీల రిజిస్టర్లను అలాగే పేరెంట్స్ కమిటి మీటింగ్ రిజిస్టర్లను పరిశీలించారు.

## కృషి విజ్ఞాన కేంద్రం సేవలను విస్తరించాలి

సీకేదిన్నె, మార్చి 4: కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు అందిస్తున్న సేవలను మరింత విస్తరించాలని తిరుపతి ప్రాంతీయ పరిశోధన కేంద్రం సహపరిశోధన సంచాలకులు రమణ తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన శాస్త్రీయ సలహా సంఘ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.

## అర్హులైన విద్యార్థులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

● వైవీయూ రిజిస్ట్రార్‌కు టీఎన్ఎస్ఎఫ్ వినతి


వినతిపత్రం అందిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 4 : అర్హులైన ప్రతి విద్యార్థి ఓటు హక్కు కలిగి ఉండాలని విద్యార్థి ఓటరుగా నమోదయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ డిమాండ్ చేశారు. సోమవారం వైవీయూలో రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తిరుమలేశ్ మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్క విద్యార్థి నూతన ఓటరుగా నమోదై ప్రజాస్వామ్య ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థి రాష్ట్ర అభివృద్ధి కోసం తన వంతు పాటుపడి మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హమీద్, సపోషల్ మీడియా కోఆర్డినేటరు విశ్వనాద్, షరీఫ్ పాల్గొన్నారు.

## పొలతలలో చురుగ్గా ఏర్పాట్లు


ఆలయ పరిసరాల్లో చదును చేస్తున్న దృశ్యం

పెండ్లిమర్రి, మార్చి 4: మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరుగనున్న ఉత్సవాలకు పొలతలలో ఏర్పాట్లు చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వాహనాల పార్కింగ్, భక్తులకు మరుగుదొడ్లు, తాగునీటి, షెల్టర్, క్యూలైన్ల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యాలు తదితర ఏర్పాట్లు సాగుతున్నాయి.

## వీఆర్ఏల సంఘం నేతల ముందస్తు అరెస్టు


ఈశ్వరయ్య, పుల్లయ్యలను అరెస్టు చేసిన పోలీసులు

వీరపునాయునిపల్లె, మార్చి 4: విజయవాడలో ఈనెల 5న నిర్వహించతలపెట్టిన 30 గంటల నిరాహార దీక్షకు వెళ్లకుండా ఏపీ వీఆర్ఏల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షుడు కోడూరు పుల్లయ్యను వీఎన్‌పల్లె పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏల ఉద్యమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

## గ్రామాలలో పోలీసుల పల్లెనిద్ర


మాట్లాడుతున్న ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి

పెండ్లిమర్రి, మార్చి 4: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మమ్ముసిద్దుపల్లె గ్రామంలో కడప రూరల్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు పల్లె నిద్ర చేశారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ కైశల్ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాలలో రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు రాజకీయ నాయకులకు, ప్రజలకు జరిగే అనర్థాలను ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి వివరించారు.

## ప్రతి ఒక్కరూ క్రీడల్లో నైపుణ్యం సాధించాలి


బహుమతులు అందిస్తున్న సాయినాథశర్మ

కమలాపురం రూరల్, మార్చి 4: ప్రతి ఒక్కరూ ఏదోక క్రీడారంగంలో నైపుణ్యం సా ధించాలని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సత్యసాయినాథశర్మ తెలిపారు. సోమవారం స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండులో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటు సోమవారంతో ముగిసింది. ఈ టోర్నమెంటుకు మొదటి బహుమతి రూ.50వేలు సాయినాథశర్మ, రెండో బహుమతి రూ.30వేలు మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జీవనశైలిలో క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. సోమవారం జరిగిన ఫైనల్ పోటీల్లో ప్రొద్దుటూరుకు చెందిన సుభాష్ 11 టీం రన్నర్‌గా నిలిచింది. వీరికి మొదటి బహుమతి, రెండో బహుమతులు సాయినాథశర్మ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో దివాకర్‌రెడ్డి, శివారెడ్డి, సుకుర్, మునిశేఖర్‌రెడ్డి, మనోహర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా చెన్నంశెట్టి మురళీక్రిష్ణ


చెన్నంశెట్టి మురళికి నియామకపత్రం అందిస్తున్న శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 4 : టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా చెన్నంశెట్టి మురళిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు. సోమవారం కడపనగరం ద్వారకానగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీవాసరెడ్డి కార్యాలయంలో చెన్నంశెట్టి మురళీకి నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బలిజలకు సముచితస్థానం కల్పిస్తుందని అందులో భాగంగానే జిల్లా అధికార ప్రతినిధిగా చెన్నంశెట్టిని నియిమించామన్నారు. కార్యక్రమంలో పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్‌రవి పాల్గొన్నారు.

## 'జువారి ఫ్యాక్టరీ నుంచి పంట పొలాలను కాపాడండి'


వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 4 : జువారి సిమెంటు ఫ్యాక్టరీ ద్వారా వచ్చే దుమ్ముధూళితో వలసపల్లి, తుమ్మలపల్లి గ్రామాల్లో చీనీ పంటలు, పూత పిందె, కాయలు రాలిపోయి దెబ్బతింటున్నాయని, ఈ విషయమై సోమవారం కడప కలెక్టరేట్ స్పందనలో జేసీ గణేశ్‌కుమార్‌కు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ జువారి ఫ్యాక్టరీ ద్వారా వచ్చే దుమ్ముధూళితో ఆయా గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో చీనీ పంటలు పూత దశలోనే రాలిపోతున్నాయన్నారు. పొల్యూషన్ కంట్రోల్ అధికారులు కానీ, వ్యవసాయ శాఖ కానీ ప్రజాప్రతినిధులు కానీ పంట పొలాలపై కన్నెత్తి కూడా చూడడం లేదన్నారు. గతంలో వరి పొట్టు, కట్టెలు, రబ్బరు వంటి వాటితో ఇబ్బందులు పడేవారని ఇప్పుడు ప్లాస్టిక్, చెత్తతో ఫార్మ కంపెనీల ద్వారా వచ్చే రసాయనాలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీని వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతిని ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు కిడ్నీలకు సంబంధించి వ్యాధులతో ఆసుపత్రులపాలవుతున్నారన్నారు.వెంటనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరును కలిసిన వారిలో బాధిత రైతులు మురళీమోహన్‌రెడ్డి, గంగాధర్రెడ్డి, కార్మిక సంఘం నాయకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పంట నమోదు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపండి


గ్రామసభలో మాట్లాడుతున్న ఏఓ రమేష్

లింగాల, మార్చి 4: 2023-24 రబీ పంటల నమోదుకు సంబంధించి జాబితాను ఆయా రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శనకు ఉంచామని, అందులో ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి రమేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఇప్పట్ల, కామసముద్రం రైతు భరోసా కేంద్రాలలోజరుగుతున్న గ్రామ సభ మరియు పంట నమోదు జాబితాను ఏఓ తనిఖీ చేశారు. జాబితాలో రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం, పంట సాగుపద్ధతి తదితర వివరాల నమోదులో అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని, వాటిని సరిదిద్ది తుది జాబితాను రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

కడప (మారుతీనగర్), మార్చి 4: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉ పాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత మహిళలకు ఈనెల 11 నుంచి టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లలో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ అధికారి ఎన్. నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు గల నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ఔత్సాహిక మహిళలకు నగర శివారు ప్రాంత కడప-తిరుపతి రోడ్‌లోని బాలికల ఐటీఐ పక్కనే గల తమ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివారాలకు 9440905478, 9985606866 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

## చిరుధాన్యాల ఆహార ఉత్పత్తుల శిక్షణా శిబిరం ప్రారంభం



కడప (నాగరాజుపేట), మా ర్చి 4:దాస్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు వారి ఆర్థిక సాయంతో కడప నగరం పీఎఫ్ ఆఫీసు ఎదురుగా గల సంస్థ కార్యాలయంలో సోమవారం చిరుధాన్యాల ఆహార ఉత్పత్తుల తయారీలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఇం దులో నాబార్డు, దాస్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్తంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా శిబిరం 15 రోజులు ఉంటుందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తామని దాస్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి ఎం.ఓబులదాస్ తెలిపారు. వివిధ ఆహార ఉత్పత్తులు తయారు చేసి గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక బృందాల సభ్యులు, పేద మహిళలు ఆర్థికంగా ఎదగాలని డాక్టర్ ప్రశాంతి అన్నారు.

## విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ

కడప (మారుతీనగర్), మార్చి 4: వేసవి ఎండ తీవ్రత నుంచి విద్యార్థులకు కాసింత ఉపశమనం కలిగించాలనే ఆలోచనతో ప్రకాష్‌నగర్‌లోని జేఎస్‌టీఎస్ ఆర్గనైజేషన్‌లో గల 70 మంది పేద విద్యార్థులకు సమారిటన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు భరత్‌కుమార్ మాట్లాడుతూ మండుతున్న ఎండలు వల్ల పాదరక్షలు పంపిణీ చేశామన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి 50 కుటుంబాలు చేరిక

మైదుకూరు, మార్చి 4 : ప్రొద్దుటూరులోని పుట్టా సుధాకర్‌యాదవ్ పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి దువ్వూరు మండలం కానగూడూరుకు చెందిన వైసీపీ నాయకులు ఇచ్చుకట్ల మాబువలి, గోవిండ్ల గౌస్‌పీర్, కమాల్‌షా, బాదుషా వారి అనుచర దాదాపు 50 కుటుంబాల వారిని ఆయన టీడీపీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు టీడీపీ అధ్యక్షుడు బోరెడ్డి రమణారెడ్డి, నాయకులు తాహీర్ హుస్సేన్, రాంబాబు, అక్బర్, లక్ష్మయ్య, శివ, పాల మాబు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర నేత నాగేశం ముందస్తు అరెస్టు

బద్వేలు, మార్చి 4 : రెవెన్యూశాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏలు 5వ తేది మంగళవారం విజయవాడలో తలపెట్టబోయే 30 గంటల నిరాహారదీక్షలకు ప్రభుత్వ అనుమతి లేదంటూ వీఆర్‌ఏ సంఘంరాష్ట్ర నేత నల్లిపోగు నాగేశంను సోమవారం బద్వేలులో ముందస్తు అరెస్టు చేశారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్ద తాము శాంతియుతంగా ధర్నా చేపట్టానున్నామన్నారు.

## మహాశివరాత్రికి నాణ్యమైన సౌకర్యాలు కల్పించాలి

చాపాడు, మార్చి 4: ఈనెల 8న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవాలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ కోరారు. ఆ దేవాలయంలో సోమవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ దేవస్థాన ఛైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి 50 కుటుంబాలు చేరిక

మైదుకూరు, మార్చి 4 : ప్రొద్దుటూరులోని పుట్టా సుధాకర్‌యాదవ్ పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి దువ్వూరు మండలం కానగూడూరుకు చెందిన వైసీపీ నాయకులు ఇచ్చుకట్ల మాబువలి, గోవిండ్ల గౌస్‌పీర్, కమాల్‌షా, బాదుషా వారి అనుచర దాదాపు 50 కుటుంబాల వారిని ఆయన టీడీపీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు టీడీపీ అధ్యక్షుడు బోరెడ్డి రమణారెడ్డి, నాయకులు తాహీర్ హుస్సేన్, రాంబాబు, అక్బర్, లక్షయ్య, శివ, పాల మాబు తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం : రూ.40వేలు ఆస్తినష్టం

పోరుమామిళ్ల, మార్చి 4 : షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో జీబీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న లూర్దుమేరీ నివాసగృహం అగ్నికి ఆహుతి కావడంతో రూ.40వేలు ఆస్తినష్టం జరిగిందని అగ్నిమాపక కేంద్రం అధికారి నజీర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం రాత్రి రంగసముద్రం పంచాయతీ పరిధిలోని జీబీనగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆమె నివాసం ఉంటున్న గృహంలోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయని విషయం తెలిసిన వెంటనే తమ సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేశామన్నారు. సోమవారం రెవెన్యూ అధికారులు జరిగిన నష్టాన్ని అంచనా వేశారు.

### టీడీపీ ప్రచార రథంపై వైసీపీ కార్యకర్తల దాడి

ప్రొద్దుటూరు, మార్చి 4: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి ప్రచార రథంపై వైసీపీ కార్యకర్తలు సోమవారం సాయంత్రం దాడి చేశారు. స్థానిక ఈశ్వర్‌రెడ్డి నగర్ ప్రాంతంలో టీడీపీ ఆటో ప్రచారాన్ని నిర్వహిస్తుండగా వైసీపీ కార్యకర్తలు ఆటో, డ్రైవర్ వెంకటరమణపై దాడికి యత్నించగా అతడు ఆటోను వదిలి పరారయ్యాడు. రాళ్లతో ఆటోను కొట్టడంతో ఫ్లెక్సీలు చిరిగిపోయాయి. ఈ మేరకు ప్రవీణ్‌రెడ్డి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

# వద్దిరాలలో దాహం కేకలు..!

మైలవరం, మార్చి 4: వద్దిరాల గ్రామంలో ప్రజలు 20 రోజులుగా నీటి సమస్యతో అల్లాడుతున్నారు. బోరులో నీరు అడుగంటడంతో మరో రెండు బోర్లు వేసినా అందులోనూ నీరు సరిగా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు సోలార్ ప్లాంట్ సమీపంలోని బోరు వద్దకు వెళ్లి నీటికి తీసుకుని వస్తుండగా, ముగ్గురు,నలుగురు కలిసి నీటి ట్యాంకరుకు రూ.500 నుంచి 700 రూపాయల ఇచ్చి నీటిని ఇంటి వద్ద తెచ్చుకుంటున్నారు. కూలీ పనులకు వెళ్లి వచ్చే మధ్య తరగతి ప్రజల అవస్థలు వర్ణణాతీతం. గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోతున్నాయి. మైలవరం నుంచి సీపీడబ్ల్యూఎస్ స్కీం నుంచి పైపు లైన్లు ఏర్పాటు చేసినా రెండు సంవత్సరాలుగా నీరు సరఫరా కాకపోవడంతో పైపు లైన్లలో మట్టి పేరుకుపోయింది. అంతేగాక నీటిని పట్టుకుంటున్న సమయంలో మహిళలు మధ్య ఘర్షణలు జరుగురుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో దాదాపు 2 వేల జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో నీరు రాక పోవడంతో బండ్లలో, ద్విచక్రవాహనాల్లో, ట్రాక్టర్లలో తదితర వాహనాల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు వద్దిరాల గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నీటి కోసం వేచి చూస్తున్న గ్రామస్థులు



**● నీటి సమస్య వచ్చినా పట్టించుకునే నాథుడు లేడు**



గ్రామంలోకి నీరు వచ్చే బోరులో భూగర్భ జలాలు ఎండిపోవడంతో 20 రోజులుగా నీటి సమస్య ఏర్పడింది. గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలి.

● గోపాల్, వద్దిరాల

**● పనులు వదిలి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది**



గ్రామంలో నీటి సమస్య ఎక్కువగా ఉండటంతో కూలి పనులకు వెళ్లే వారు పనులు మానుకుని నీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. కొందరు వాహనాల్లో తీసుకుని వస్తుండగా మరి కొందరు ట్యాంకర్ల ద్వారా డబ్బులకు తెచ్చుకుంటున్నారు. కూలి పనులకు వెళ్లే వారిని ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

● సుబ్బరాయుడు, వద్దిరాల

**● రెండు, మూడు రోజుల్లో నీటి సమస్య లేకుండా చర్యలు**

వద్దిరాల గ్రామంలో నీటి సమస్య ఉన్న మాట వాస్తవమే. భూగర్భజలాలు అడుగంటి పోయాయి. రెండు బోర్లు వేసినా నీరు సరిగా పడలేదు. మైలవరం సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా వచ్చే పైపు లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నాం. గొల్లపల్లి గ్రామం వరకు పూర్తి అయింది. రెండు, మూడు రోజుల్లో వద్దిరాలకు సరఫరా చేసి నీటి సమస్య లేకుండా ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

● సుధీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మైలవరం



ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న వరదరాజులరెడ్డి



కాశినాయనలో ప్రచారం చేస్తున్న బొజ్జ రోశన్న

## వైసీపీ హత్యా రాజకీయాలకు చరమగీతం పాడాలి







ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రవీణ్‌రెడ్డి, భూపేశ్‌రెడ్డి, చాపాడులో పార్టీలో చేర్చుకుంటున్న పుట్టా సుధాకర్‌యాదవ్

ప్రొద్దుటూరు,మార్చి 4 : వైసీపీ హత్యారాజకీయాలకు చరమగీతం పాడాల్సిన సమయం దగ్గర పడిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గాంధీరోడ్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్‌జబీవుల్లా, బండి భాస్కర్‌రెడ్డి, బోడెలబాబుల్‌రెడ్డి, తాటి శ్రీనివాసులు, ఆవులదస్తగిరి,పొణ్యం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

**చాపాడు..:** జగన్‌మోహన్‌రెడ్డి పేరు వినగానే రాష్ట్ర ప్రజలు భయపడుతున్నారని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. గుంతచియ్యపాడు గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మల్లోత్ర, వంశీ, మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, నారపురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణ, రాజా, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటరమణారెడ్డి, మోహన్‌యాదవ్, గోర్ల సుబ్బరాయుడు, నంది మండలం క్రిష్ణారెడ్డి, పసల రమణ పాల్గొన్నారు.

**● 50 కుటుంబాలు టీడీపీలో చేరిక..:** గుంతచియ్యపాడు గ్రామంలో సోమవారం వైసీపీకి చెందిన 50 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. పుట్టా సుధాకర్‌యాదవ్ వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో ప్రసాద్, ఓబులేసు, దస్తగిరి, పెద్ద ఓబులేసు, హుస్సేన్, చిన్నహుస్సేన్, ప్రొద్దుటూరు విశ్వం, శేఖర్, ఓబులేసు,ఇంకా 40 కుటుంబాలవారు ఉన్నారు.

**ప్రొద్దుటూరు..:** రాష్ట్రానికి రాజధానిని లేకుండా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం 12 వవార్డులోని ఇస్లాం పురం వీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నాగమునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, అబ్దుల్ రసూల్, ఫరూక్, రసూల్‌గౌస్, రియాజ్, ఖాదర్‌బాషా, అజీజ్, ఖలందర్, అఫ్రోజ్, నాయబ్, మౌలా, మహబూబ్‌బాషా, నూర్‌మహ్మద్,సద్దాం, రసూల్, పాల్గొన్నారు.

**జమ్మలమడుగు..:** మహిళల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

**● 10 కుటుంబాలు టీడీపీలో చేరిక..:** జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో భూపేశ్‌రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి వెళ్లారు. ఈ సందర్భంగా మోరగుడి గ్రామంలోని పది కుటుంబాల వారు భూపేశ్‌రెడ్డిని ఆహ్వానించి పార్టీలో చేరారు. చేరినవారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో మల్లికార్జునరెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, శోభన్, అంజనేయులు, శేషయ్య తదితరులు చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్, పొన్నతోట మల్లికార్జున, తలమంచిపట్నం లక్ష్మణనాయుడు, వెంకటరామిరెడ్డి, ధనుంజయ, గురుశేఖర్, పాండు రంగడు, విశ్వనాథరెడ్డి, లక్ష్మీరెడ్డి, బాలిరెడ్డి,సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

**మైలవరం..:** చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుఅని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి అన్నారు. సోమవారం దొమ్మర నంద్యాల గ్రామంలో శివారెడ్డి కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ మహేశ్వరి, బూసిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, సూర్యపెద్దిరాజు, కొండయ్య, ప్రసాద్, కృష్ణారెడ్డి, బాష, నాగలక్షుమయ్య, శంకర్, ఇమామ్ హుస్సేన్, చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

**రాజుపాలెం..:** మండల పరిధిలోని పగిడాల గ్రామంలో సోమవారం టీడీపీ ఇన్‌ఛార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి ఇంటింటికీ తిరిగి ఆరు గ్యారంటీల పత్రాన్ని ప్రజలకు అందించారు. సైకిలు గుర్తుకు ఓటు వేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నం భూపాల్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, రవికాంత్‌రెడ్డి, ఎంపీటీసీ దస్తగిరి, రవిరెడ్డి పాల్గొన్నారు.

**కాశినాయన..:** ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జరోశన్న, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వడ్డమాను,వంకమర్రి,సిద్దాయపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, పంగా రవీంద్రారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి,శ్రీనివాసులరెడ్డి, రోహిత్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, బంగారురెడ్డి, పాలగురివి రెడ్డి,సుబ్బా రెడ్డి, సాంబబాలయ్య,అశ్వర్ బాలయ్య,వీరకుమార్‌రెడ్డి, పీరయ్య,శంకర్ పాల్గొన్నారు.

**బద్వేలు..:** చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి అని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు చెన్నంపల్లెమిటపై బాబుష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వార్డు కౌన్సిలరు ధనలక్ష్మి, జీవీ సుబ్బారెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరిక



పోరుమామిళ్లలో వైసీపీ నుంచి యువనేత రితీష్ కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన అన్నం కుటుంబసభ్యులు

పోరుమామిళ్ల, మార్చి 4 : వైసీపీ నుంచి అన్నం కుటుంబ సభ్యులతో పాటు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. సోమవారం రాత్రి పోరుమామిళ్లలోని ముస్లిం కోటా వీధిలో టీడీపీ యువనేత రితీష్‌కుమార్ రెడ్డి సమక్షంలో అన్నం కుటుంబ సభ్యులు అన్నం వెంకటక్రిష్ణ, అన్నం కొండయ్య,అన్నం వెంకటేశ్వర్లు, అన్నం గోవిందు, అన్నంరాజేష్, ఎక్కంటి రమణయ్య, ఎక్కంటి సుధీర్‌కుమార్, ఎక్కంటి రాజశేఖర్, తోట ప్రసాద్‌లతో పాటు 50 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పోరుమామిళ సర్పంచ్ యనమల సుధాకర్, నగరి భైరవ ప్రసాద్, చెరుకూరి చెన్నరాయుడు, సీతా వెంకటసుబ్బయ్య, కొండారామక్రిష్ణారెడ్డి, ఇమాంహుస్సేన్, రామసుబ్బారావు, శెట్టెం ప్రతాప్, అతికారి రాజా, రంతుల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్లూరులో 30 కుటుంబాలు...

అట్లూరు, మార్చి 4 : అట్లూరు మండలంలోని ఎస్.వెంకటాపురం పంచాయతీకి చెందిన కోటపాటి పెంచలయ్య, బహ్మాదండు శ్రీనివాసులు, వెంకటయ్య ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 30 కుటుంబాలు సోమవారం యువ నాయకుడు రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసం టీడీపీలో చేరారు. వీరు మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మంచూరి సూర్యనారాయణరెడ్డి, బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి నాయకత్వంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.